కార్పొరేషన్‌లో కబ్జాలపై ఆరా!



- నిజామాబాద్ నగర కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం
- చెరువులు, కుంటల భూములు సైతం మాయం!
- ఆక్రమణకు గురైన భూముల వివరాల సేకరణ
- ప్రభుత్వానికి నివేదించేందుకు సిద్ధం అవుతున్న అధికారులు

నిజామాబాద్, జనవరి4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ నగరంలోని ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై యంత్రాంగం ఆరా తీస్తోంది. నగరం పరిధిలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల వివరాలను సేక రిస్తోంది. నగరంలో ఉన్న చెరువులు, పార్కులు, దేవాలయాలతోపాటు ఇతర భూముల వివరాలను తీసుకుంటోంది. గత ప్రభుత్వ హయాంలో ఎంత మొత్తంలో కబ్జాకు గురయ్యాయో వివరాలపై ఆరా తీస్తున్నారు. కబ్జా భూముల్లో ఏయే నేత ప్రమేయం ఉందో తీసుకుంటూ నివేదించేందుకు సిద్ధమవుతున్నారు. కబ్జాదారుల పూర్తి వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తూ ఎంతమొత్తంలో భూమి ఉందో వివరాలను పంపిస్తున్నారు.

చేతులు మారిన భూములు

నిజామాబాద్ నగరం పరిధిలో ఉన్న భూముల అన్యాక్రాంతంపై సీఎంతో పాటు ఇతర మంత్రుల దృష్టికి వెళ్లడంతో ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. నగరం అభివృద్ధి చెందిన క్రమంలోనే ప్రభుత్వ భూములు పెద్ద ఎత్తున కబ్జాలకు గురయ్యాయి. నగరం పరిధిలో పలు చెరువులు, కుంటలకు సంబంధించిన శిఖం భూములు సైతం మాయమయ్యాయి. దేవాలయ భూములు కబ్జాకు గురయ్యాయి. ఇవేకాకుండా అటవీ, ఇతర శాఖలకు చెందిన భూములు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. నగరంలోని పలు పార్కుల భూములను కబ్జాచేశారు. ఈ భూముల్లో నిర్మాణాన్ని చేశారు. వెంచర్లలో అపార్ట్‌మెంట్ నిర్మాణాల్లో వదిలివేసిన ప్రభుత్వ భూములను కూడా కబ్జా చేసి నిర్మాణాలు చేశారు. కొన్ని పార్కుల ఆనవాలు లేకుండా చేశారు. వీటిని పాత పేపర్లతో బినామీ దస్త్రావేజులను సృష్టించి ఆ భూములను అన్యాక్రాంతం చేశారు. ఇతరులకు విక్రయించేశారు. చాలా భూముల్లో ఇళ్ల నిర్మాణం కూడా జరిగాయి. నిజామాబాద్ నగరం పరిధిలోని నాగారం, బాబన్‌సాహెబ్ పాడ్, ధర్మపురి హిల్స్, అర్సపల్లి, బైపాస్‌రోడ్, బోర్గాం, పాంగ్రా, ముబారక్‌నగర్, మానిక్‌భండార్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో ఎక్కువ మొత్తంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయి. ఒకరి నుంచి వేరొకరి చేతుల్లోకి వెళ్లిపోయాయి. వీరికి కొంత మంది నేతలు సహకరించడంతోనే ఈ తతాంగం అంతా సాగినట్లు ఆరోపణలున్నాయి.

పేదల పట్టా భూములు మాయం

ఉమ్మడి రాష్ట్రంలో పేదలకు ఇళ్ల కోసం ఇచ్చిన పట్టా భూములు కూడా పెద్ద ఎత్తున కబ్జాకు గురయ్యాయి. పలువర్గాలకు అప్పటి ప్రభుత్వం 40 నుంచి 100 గజాల్లోపు స్థలాలు కేటాయించారు. అప్పటి తహసీల్దార్ల ద్వారా కేటాయింపు లేఖలను ఇచ్చారు. భూములు కేటాయించిన తర్వాత పేదలు ఇళ్లు కట్టుకోకపోవడం వల్ల కొంతమంది నేతలు పెద్దఎత్తున కబ్జాలకు పాల్పడ్డారు. తమ అనుచరులను రంగంలోకి దించి బినామీ లేఖలను సృష్టించి వాటిలో ఇళ్లు నిర్మాణం చేశారు. అసలైన వారు వస్తే వారికి నయానో బయానో చెప్పి వారికి కొంత మొత్తంలో డబ్బులు ఇచ్చి అమ్మినట్లు చూపించారు. భారీఎత్తున అమ్మకాలు ఇతరులకు చేశారు. వీటిలో ఇళ్ల నిర్మాణం సాగింది. అయితే కబ్జాకు గురైన ప్రభుత్వ భూములు కావడంతో వాటి రిజిస్ట్రేషన్ కావడంలేదు. మున్సిపాలిటీలో ఇంటి నెంబర్ తీసుకొని కొన్నింటిని చేయించుకున్నా మరికొన్ని ఇప్పటికీ కాలేదు. కబ్జాలు చేసినవారు ఇతరులకు అమ్మడంతో కొన్నవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కబ్జా భూముల వివరాల సేకరణ

నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ భూములు ఎన్ని? ఏయే శాఖకు సంబంధించిన భూములెన్ని? ప్రస్తుతం ఎన్నిభూములు ఆయాశాఖల స్వాధీనంలో ఉన్నాయి..? అనే వివరాల ఆధారంగా అధికా రులు నివేదికలను తయారు చేస్తున్నారు. కబ్జాకు గురైన ఈ భూములు ఎవరి చేతిలో ఉన్నాయి.. ఆ నేత స్థాయి ఎంత.. ఏ పదవిలో ఉన్నారో వారికి అప్పటి ఏయే ప్రజాప్రతినిధి సహకరించారో ఆ వివరాలను తీసుకుంటున్నా రు. వీటి ఆధారంగా చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గృహలక్ష్మి కింద ఇళ్ల కేటాయింపు సమయంలో వీటిని స్వాధీనం చేసుకొని పేదోళ్లకు కేటాయించే విధంగా ప్రయత్నాలను చేస్తున్నట్లు తెలుస్తోంది.





తరగతి గదులను ప్రారంభిస్తున్న మంత్రి

విద్యా, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

జక్రాన్‌పల్లి, జనవరి4: విద్యా, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం జక్రాన్‌పల్లిలో ప్రముఖ పారిశ్రామికవేత్త పైపుల రాజారెడ్డి ఆధ్వర్యంలో పలువురు దాతల సహకారంతో రూ.3కోట్లతో నూతనంగా నిర్మించిన 20 పాఠశాల తరగతి గదులను, తొమ్మిది మడిగెలు, వంటశాల గది, లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో దేవుడు తోటలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి కలిసి ప్రారంభోత్సవం చేశారు. లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం పాఠశాలలో సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ 30, 100 పడకల ఆసుపత్రి ఉంటే సరిపోదని ఆసుపత్రిలో అన్నివిధాలా సిబ్బందిని భర్తీచేస్తేనే న్యాయం చేసిన వారమవుతామన్నారు. విద్యా, వైద్యంపై చూలకనగా చూడవద్దన్నారు. దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ మంచి పథకాలు తీసుకువచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలో ఇచ్చినమాట ప్రకారం రూ.10లక్షల ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్నామన్నారు అందరికీ విద్య, అందరికి వైద్యం అందించేడమే ప్రభుత్వ లక్ష్యామన్నారు. పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. ఇందల్వాయిలో ట్రామా సెంటర్‌ను మంజూరు చేస్తామని, ఆర్మూర్ ఆసుపత్రికి అంబులెన్స్ మంజూరు చేశామన్నారు. ప్రతీఒక్కరు సేవ చేయాలనే తపన ఉండాలని, అప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రధాన దాత, పాఠశాల అభివృద్ధికమిటీ చైర్మన్ పైపుల రాజారెడ్డి ముందుకు వచ్చి పాఠశాలల గదులను, తరగతి గదులను నిర్మించి ఇవ్వడం అభినందనీయమని అన్నారు. అనంతరం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా, వైద్యంపై నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రతీ మండలంలో ఇంటర్నేషనల్ పాఠశాలలను నిర్మించాలని మంత్రికి విన్నవించారు. అనంతరం పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పైపుల రాజారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని పది ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నామన్నారు. పాఠశాలలో ఫర్నీచర్, గదులు, ఉపాధ్యాయులు, అటెండర్ కొరత ను పరిష్కరించాలని కోరారు. ప్రైమరీ పాఠశాలలను హైస్కూల్‌లో విలీనం చేయాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డాక్టర్ భూపతిరెడ్డి, పైడి రాకేష్‌రెడ్డి, జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, స్థానిక ఎంపీపీ కుంచాల విమల, జడ్పీటీసీ తనుజారెడ్డి, సర్పంచ్‌లు చంద్రకళ, ఎం.చిన్నసాయిరెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్, మునిపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఎం.సాయిరెడ్డి, ఉపసర్పంచ్ బాలకిషన్, ఎంపీటీసీలు రూపాల గంగారెడ్డి, మరియ సతీష్, అనిత, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ భూషణ్, ఉమమహేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, డీఈవో దుర్గాప్రసాద్, ఎంఈవో శ్రీనివాస్, హెచ్ఎం లింగన్న, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌లో చేతులెత్తిన కౌన్సిలర్లు

ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై.. నెగ్గిన అవిశ్వాసం

- సొంత పార్టీ కౌన్సిలర్ల చేతిలోనే మాజీ అయిన పండిత్ వినీత
- త్వరలోనే నూతన చైర్‌పర్సన్ ఎన్నిక
- రేసులో ముందు వరుసలో ఖాందేశ్ సంగీత

ఆర్మూర్ టౌన్, జనవరి4: జిల్లాలోని ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అవిశ్వాస తీర్మానం విజయానికి 24 మంది కౌన్సిలర్‌లు కావాల్సి ఉండగా.. మెజారిటీ కౌన్సిలర్‌లు తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయడంతో పండిత్ వినీత పదవిని కోల్పోయింది. గురువారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన అవిశ్వాస తీర్మానానికి 20మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నలుగురు భారతీయ జనతా పార్టీ కౌన్సిలర్‌లతో పాటు ఎక్స్ ఆఫీషియో సభ్యుడి హోదాలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి హాజరయ్యారు. అవిశ్వాస తీర్మానానికి సరిపడా కోరం సభ్యులు హాజరు కావడంతో.. తీర్మానంపై ఓటింగ్ జరిగింది. తీర్మానానికి హాజరైన వారందరూ అనుకూలంగా ఓటు వేశారు. చైర్‌పర్సన్ వర్గీయులు సమావేశానికి హాజరు కాలేదు. దీంతో ప్రత్యేక అధికారి ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్ అవిశ్వాస పరీక్షనెగ్గినట్టు ప్రకటించగా ప్రస్తుత చైర్‌పర్సన్ పండిత్ వినీత తన పదవిని కోల్పోయారు.

● త్వరలోనే నూతన చైర్‌పర్సన్ ఎన్నిక

అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో తీర్మాన ప్రతిని అధికారులు జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నారు. నూతన చైర్‌పర్సన్ ఎన్నిక ఎప్పుడు నిర్వహించే విషయమై అధికారులు త్వరలోనే నిర్ణయిస్తారని తెలిసింది. మరోవైపు.. అవిశ్వాస తీర్మానం నెగ్గిన వెంటనే కౌన్సిలర్లు బస్సులో క్యాంపునకు బయలుదేరి వెళ్లారు. చైర్‌పర్సన్ పదవిని దక్కించేందుకు బీఆర్ఎస్ నాయకులు వారి వారి ప్రయత్నాల్లో ఉన్నారు. ఖాందేశ్ సంగీత శ్రీనివాస్ చైర్‌పర్సన్ రేసులో ముందంజలో ఉన్నారు. సామాజిక సమీకరణాల దృష్ట్యా ఆమెకు పదవి దక్కే అవకాశం ఉంది. అదే సమయంలో అయ్యప్ప లావణ్య శ్రీనివాస్ కూడా చైర్‌పర్సన్ రేసులో ఉన్నారు. వీరిద్దరూ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి ప్రధాన అనుచరులు. కాగా.. పండిత్ వినీతను పదవి నుంచి దించేందుకు బీజేపీ కౌన్సిలర్‌లు కూడా సహకారం అందించారు. ఈ నేపథ్యంలో నూతన చైర్‌పర్సన్ ఎన్నిక విషయంలో వారి స్పందన ఎలా ఉంటుందన్న విషయం తెలియాల్సి ఉంది. బీజేపీ పార్టీ చైర్‌పర్సన్ ఎన్నిక విషయంలో బీఆర్ఎస్‌కు సహకరిస్తుందా.. లేదా తామే మున్సిపాలిటీని దక్కించుకోవడానికి వ్యూహాలు పన్నుతోందా!? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

● పండిత్ వినీతకు చెక్ పెట్టిన సొంత పార్టీ నేతలు

గతంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని అనూహ్యంగా దక్కించుకున్న పండిత్ వినీతకు సొంత పార్టీ కౌన్సిలర్‌లే చెక్ పెట్టడం గమనార్హం. పండిత్ వినీతను సాగనంపడానికి మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చక్రం తిప్పారు. జీవన్‌రెడ్డి ఆశీర్వదంతోనే చైర్‌పర్సన్‌గా నెగ్గిన వినీత.. ఆయన ద్వారా పదవిని కోల్పోవడం విశేషం. కొంతకాలం నుంచి చైర్‌పర్సన్‌పై కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టడానికి ప్రయత్నాలు చేశారు. అప్పట్లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కౌన్సిలర్‌లను వారించడంతో కొన్నినెలల పాటు ఈ వివాదం సద్దుమణిగింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం తిరిగి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి బీఆర్ఎస్ నాయకులు తమ ప్రయత్నాలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ కౌన్సిలర్లకు చైర్‌పర్సన్ భర్త, అతని సోదరుడితో కుదరక పోవడం, మున్సిపల్‌లో వీరు ఏకపక్షంగా వ్యవహరించడం పట్ల ఆగ్రహంతో ఉన్న కౌన్సిలర్‌లు చైర్‌పర్సన్ పదవి నుంచి దించాలన్న ప్రయత్నాలను బలంగా కొనసాగించారు. వీరికి మాజీ ఎమ్మెల్యే మద్దతు కూడా లభించడంతో చైర్‌పర్సన్‌ను పదవి నుంచి తొలగించడంలో సఫలీకృతులయ్యారు.



విజయ దరహాసంతో కౌన్సిలర్లు

అవినీతిపై విజయం సాధించాం : ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో అవినీతి, అక్రమాలపై విజయం సాధించినట్టయ్యింది. నాలుగేళ్లలో చోటుచేసుకున్న అనేక పరిణామాలపై అవిశ్వాస తీర్మానం నెగ్గడం ప్రజావిజయం.



● ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రతీ దరఖాస్తును స్వీకరించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

జక్రాన్‌పల్లి, జనవరి4: ప్రజాపాలనలో ప్రజలు ఇచ్చే ప్రతీ దరఖాస్తును అధికారుల, సిబ్బంది తప్పకుండా స్వీకరించాలని, అర్హులైన ప్రతీఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. గురువారం పడకల్ గ్రామంలో ప్రజాపాలన గ్రామసభను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సందర్శించారు. అనంతరం ప్రజలు చేసుకునే దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. అర్గుల్‌లో ప్రజల దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీనివాస్, అక్బర్, గోర్త పద్మ, ఉపసర్పంచ్ గోర్త రాజేందర్, ఎంపీడీవో బ్రహ్మనందం, తహసీల్దార్ ఎంఎ.ఖలీం, ఎంపీవో యుసుఫ్‌ఖాన్, పంచాయతీ అధికారి రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రైతులకు వసతులు కల్పించేందుకు కసరత్తు!

- మార్కెట్‌కు ఆశించిన మేర ఆదాయం వసతుల కల్పనకు చర్యలు
- రూ.10 లక్షల నిధుల కోసం ప్రతిపాదనలు

ఖిల్లా, జనవరి 4: గత కొన్నేళ్లుగా వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రైతులకు మౌలిక సదుపాయాలను కల్పించని అధికారులు ఈ ఏడాది రైతులకు మెరుగైన సేవలను కల్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్‌కు గతేడాది ఆశించిన మేర ఆదాయం రావడంతో అధికారులు రైతులకు వసతులు కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల ఆ శాఖాధికారులు వరుస సమీక్షలు నిర్వహించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ముందస్తుగానే ప్రణాళికలను రూపొందించి నిధుల కోసం నివేదికలను రూపొందించినట్లు తెలిపింది. యార్డ్‌లో రైతుల కోసం ఏఏ పనులు చేయించాలని నివేదిక రూపొందించాలని సూచించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రైతుల విశ్రాంతి గదులు, తాగునీటి సదుపాయాలు కల్పించాలని తెలిపింది. జిల్లా కేంద్రంలో గల శ్రద్ధానంద్ గంజ్ వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో రైతుల కోసం అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. యార్డ్‌లో రైతుల కోసం మౌలిక వసుతుల కల్పనకు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. యార్డ్‌కు వచ్చే పసుపు రైతులకు ఎటువంటి ఇబ్బందు లు కలుగకుండా ఇప్పటినుంచే కసరత్తు మొదలుపెట్టారు. యార్డ్‌లో గల బిడ్డింగ్ షెడ్లను మరమ్మతు చేస్తున్నారు. యార్డ్‌లో మొత్తం 42 బిడ్డింగ్ షెడ్లు ఉన్నాయి. వాటిని శుభ్రం చేయించి రైతులకు అందుబాటులో ఉంచడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారు. రైతులు పండించిన పసుపును అమ్ముకోవడానికి సంక్రాంతి అనంతరం యార్డ్‌కు తరలించే అవకాశాలు ఉన్నందున అందుకు తగ్గ ఏర్పాట్లను చేస్తున్నారు. ముఖ్యంగా రైతు విశ్రాంతి గదులకు మరమ్మతులు చేస్తున్నారు. విద్యుత్ బల్బులను ఏర్పాటు చేస్తున్నారు.

యార్డ్‌లో ఆర్‌వో వాటర్ కోసం ఏర్పాట్లు

వ్యవసాయ మార్కెట్‌లో రైతుల కోసం కొత్తగా ఆర్‌వో వాటర్ ప్లాంట్ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. యార్డ్‌లో పలు చోట్ల నల్లాలను ఏర్పాటు చేస్తున్నారు.

దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు

యార్డ్‌లో దొంగతనాలను నియంత్రించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. యార్డ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గల ఎలక్ట్రిక్ తూకాలను పెడుతున్నారు. రైతుల అనుమానాలను తీర్చడానికి యార్డ్‌లో పలుచోట్ల సిబ్బంది పర్యవేక్షణను నియమించారు. వర్షాకాలంలో రైతుల పంటలు నీటికి తడువకుండా ఉండేందుకు టార్పలిన్లు అందుబాటులో ఉంచుతున్నారు.

గిడ్డంగుల వ్యవస్థ

యార్డ్‌లో రైతులు తమ ఉత్పత్తులను నిలువ ఉంచుకోవడానికి గిడ్డంగుల వ్యవస్థను కలిగిస్తున్నారు. రైతు పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రాని పక్షంలో తమ సరుకును నిలువ ఉంచుకోవడానికి గిడ్డంగులను అందుబాటులో తీసుకొస్తున్నారు. యార్డ్‌లో మొత్తం 17 గిడ్డంగులు ఉన్నాయి. రైతులు పండించిన పసుపుకు ధర రాని సమయంలో వాటిని నిల్వ చేసుకోవడంతో పాటు వారు అనుకున్నప్పుడు అమ్ముకోవడానికి వీలుగా ఆ శాఖ 75 శాతం రుణం ఇవ్వనుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు పథకం ద్వారా రుణం పొందే అవకాశంను కల్పించనున్నారు.

ప్రారంభం కాని కొనుగోళ్లు

గతంలో ఆరు నెలలకు వచ్చే ప్రతిభ రకం పసుపును రైతులు పండించేవారు. ప్రతిభ రకం పండించిన పసుపును రైతులు దీపావళి అనంతరం అమ్ముకోవడానికి యార్డ్‌కు తీసుకొచ్చేవారు. కానీ ఈ ఏడాది ప్రతిభ రకం విత్తనాలు లభించకపోవడంతో ఆ రకం పసుపును రైతులు సాగు చేయలేదు. దీంతో తొమ్మిది నెలలకు వచ్చే ఎర్ర గుంటూరు రకం పసుపును ఈ ఏడాది రైతులు సాగు చేశారు. పంట ఈనెల చివరిలో చేతికి వచ్చే అవకాశాలున్నాయి.



సదుపాయాల కోసం రూ.10లక్షల నిధుల ప్రతిపాదన

- ఈ.వెంకటేశం, సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి

పసుపు పండించే రైతులకు యార్డ్‌లో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఇప్పటినుంచే అన్నిచర్యలు తీసుకుంటున్నాం. గతేడాదిలో సుమారు 7లక్షల క్వింటాళ్లకు పైగా పసుపు క్రయవిక్రయాలు జరిగాయి. ఈ ఏడాది సైతం ఎక్కువగా పసుపు పంట అమ్మకానికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. యార్డ్‌లో రైతులకు స్వచ్ఛమైన తాగు నీరుతోపాటు విశ్రాంతి గదులను ఏర్పాటు చేస్తున్నారు. ఎటువంటి లోటుపాట్లు జరుగకుండా ఉండేందుకు, మౌలిక వసతులు కల్పించేందుకు రూ.10లక్షల నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం.

పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంఈవో

నసురుల్లాబాద్, జనవరి 4 : 2024 సంవత్సర పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను గురువారం నసురుల్లాబాద్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్‌రావు ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు హన్మాండ్లు మాట్లాడుతూ పీఆర్‌టీయూ సంఘం ఉపాధ్యాయుల సమస్యల సాధనలో ముందు ఉంటుందని, సీపీఎస్ విధానం రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలు చేయాలని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, 317 ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చందర్, రాష్ట్ర బాధ్యులు వెంకాగౌడ్, హన్మాండ్లు యాదవ్, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భూషణ్, మండల బాధ్యులు సంజీవులు, సుజాత, శ్రీచంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నసురుల్లాబాద్‌లో పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

సమస్యల వలయంలో ఏర్గట్ల పీహెచ్‌సీ

● పూర్తి స్థాయిలో సిబ్బంది లేని వైనం ● మౌళిక వసతులు కరువు ● నిరుపయోగంగా మూలన పడ్డ పరికరాలు



ఏర్గట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



విద్యుత్ సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్న పరికరాలు

ఏర్గట్ల, జనవరి 4: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వం ఆదేశించినా అది క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. ఏర్గట్ల మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను నిర్మించి ఏళ్ళు గడుస్తున్నా ఇంత వరకు వైద్య సిబ్బందిని కేటాయించలేదు. సరియైన వసతులు లేక అత్యవసర వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆసుపత్రిలో చికిత్స కోసం, వైద్యుల కోసం ఏర్పాటు చేసిన పరికరాలు, వస్తువులు పనికి రాకుండా తుప్పు పడిపోతున్నాయి. పిహెచ్‌సీలో కేవలం ఒక మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఇన్‌చార్జి అటెండర్‌తో నెట్టుకొస్తున్నారు. మెడికల్ ఆఫీసర్ అందుబాటులో ఉండటంతో రోజుకు 30 మంది సాదారణ ఓపిలు చేస్తున్నారు. పిహెచ్‌సీకిలో వైద్య సిబ్బంది లేకపోవడంతో చికిత్సల కోసం వచ్చే రోగులకు ఆ ఇద్దరే వైద్యం అందించాల్సిన పరిస్థితి నెలకొంది. పిహెచ్‌సీలో ప్రధానంగా మౌళిక వసతులైన విద్యుత్, నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కుంటున్నామని తెలుపుతున్నారు. 3 ఫేజ్ కరెంట్ లేకపోవడంతో పాము కాటు, కుక్కకాటుకు మెడిసిన్ ఫ్రిజ్‌లో నిలువ చేయలేకపోతున్నారు. దీంతో మండల పరిధి గ్రామాలైన బట్టాపూర్, తొర్తి, తాళ్ళరాంపూర్, దోంచంద, గుమ్మిర్యాల్, తడపాకల్‌లో ఉండే ప్రజలకు వైద్య అందక నానా అవస్థలు పడుతున్నారు. అంతే కాక ప్రసావాల కోసం, కుటుంబ నియంత్రణ వంటి ఆపరేషన్‌లకు దూర ప్రాంత్రాలకు వెళ్ళి ప్రైవేట్ ఆసుప్రతులకు వెళుతున్నారు. పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని కేటాయిస్తే మండలంలోని గ్రామాలే కాకుండా ఇతర మండలాలకు చెందిన ప్రజలు కూడా వైద్య సేవలు పొందవచ్చు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆరోగ్యం కేంద్రంలో పూర్తి స్థాయి వైద్య సేవలు అందేలా వైద్యాధికారిని సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పూర్వ విద్యార్థుల సాయం

బీర్కూర్, జనవరి 4 : బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన అంబయ్య అనే యువకుడు గత వారం రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. ఇదిలా ఉండగా మృతుడు అంబయ్య క్లాస్‌మేట్స్ గురువారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం 28 వేల 500ల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అంబయ్య 2004లో పదో తరగతి చదివాడు. అంబయ్య క్లాస్‌మేట్స్ కుటుంబాన్ని పరామర్శించడం, ఆర్థిక సహాయం చేయడం హర్షణీయమని గ్రామస్థులు పేర్కొన్నారు.

కొనసాగుతున్న అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ

మద్నూర్, జనవరి 4 : మండలంలోని లచ్చన్, అంతాపూర్, తదితర గ్రామాలలో, డోంగ్లీ మండలంలోని కుర్ల గ్రామంలో లబ్ధిదారుల నుంచి అభయ హస్తం దరఖాస్తులు స్వీకరించారు. 3 గ్రామాలలో 1143 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

రెడ్‌క్రాస్ 10 వేల ఆర్థిక సహాయం

పిట్లం జనవరి 4 : మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మి బాధితురాలికి గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర కమిటీ సభ్యులు సంజీవ్‌రెడ్డి రూ.10 వేల ఆర్థికసహాయం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్‌రాష్ట్ర సభ్యులు మాట్లాడుతూ చిన్నకొడప్‌గల్ గ్రామంలో గత రెండు రోసుల క్రితం వడ్ల లక్ష్మి నివాసపు ఇల్లు విద్యుత్‌షాక్‌తో పూర్తి కాలిపోయినది, ఇంట్లో వస్తువులు పూర్తి కాలిపోవడంతో తమ వంతు సహాయంగా ఆర్థిక సహాయం, వంటసామాగ్రి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ అధ్యక్షులు బుడాల నవీన్, వేణుగోపాల్, బోడ్లరాజు, విండో చైర్మెన్ నారాయణరెడ్డి, పెద్దలు శ్రీనివాస్‌రెడ్డి, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముత్యంపేటలో 905 దరఖాస్తుల స్వీకరణ



ముత్యంపేటలో దరఖాస్తులు అందజేస్తున్న దృశ్యం

దోమకొండ, జనవరి 4 : మండలంలోని ముత్యంపేట గ్రామంలో గురువారం నాటికి 905 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. మొత్తం గ్రామంలో 1437 రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. ప్రజలు ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు అందజేయాలని జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ తిరుపతిగౌడ్, అశబోయిన శ్రీనివాస్,రవి, సంజీవ్, మధు, శ్రీహరి సీతారాం మధు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలో పోలీసుల తనిఖీలు



ఎల్పుగొండ చౌరస్తా వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

దోమకొండ, జనవరి 4 : మండల కేంద్రంలోని ఎల్పుగొండ చౌరస్తా వద్ద గురువారం ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహన పత్రాలు తనిఖీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు తప్పకుండ పాటించాలన్నారు. కార్యక్రమంలో పీసీలు స్రామాట్, చంద్రకాంత్ ఉన్నారు.

బాల్కొండ కళాశాలలో సావిత్రీబాయి పూలే జయంతి



బాల్కొండ కళాశాలలో క్రీడాకారులతో జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి రఘురాజ్

ముప్కాల్, జనవరి 4 : స్త్రీ అభ్యుదయవాది, సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే 192వజయంతి వేడుకలను గురువారం బాల్కొండ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి రఘురాజ్ పాల్గొన్నారు. అనంతరం సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్రస్థాయి బీచ్‌వాలీబాల్ పోటీలో గోల్డ్‌మెడల్ సాధించిన అకాష్, విజ్ఞాన్‌రాజ్‌లను ముగ్గురు క్రీడాకారులను జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి రఘురాజ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అర్గుల చిన్నయ్య, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజా పాలనలో దరఖాస్తులు స్వీకరణ

ముప్కాల్, జనవరి 4 : ఆరు గ్యారంటీ దరఖాస్తుల స్వీకరణల నేపథ్యంలో ప్రజాపాలనలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరణ కొనసాగుతుంది. గురువారం బాల్కొండ, ముప్కాల్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారు.

సీఎంవో కార్యదర్శిని కలిసిన ట్రేసా



సీఎంవో కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమణ్‌రెడ్డి, తదితరులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 4 : సీఎంవో కార్యదర్శిగా నియమితులైన జిల్లాకు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డిని గురువారం తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు ట్రేసా తరఫున మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ట్రేసా జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, గౌతంకుమార్, తదితరులు చంద్రశేఖర్‌రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

నేడు నగరంలో

ప్రజాపాలన కేంద్రాలను సందర్శించనున్న షబ్బీర్‌అలీ

నిజామాబాద్ అర్బన్, జనవరి 4 : ప్రభుత్వం ప్రజల నుంచి వివిధ సంక్షేమ పథకాల కోసం ప్రజాపాలన పేరుతో స్వీకరిస్తున్న దరఖాస్తుల కేంద్రాలను శుక్రవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ సందర్శించనున్నారు. నగరంలో ని వివిధ డివిజన్‌లలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాలను ఆయన పరిశీలించనున్నట్లు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్మూర్ డిపో మేనేజర్‌కు

ఎంప్లాయీస్ యూనియన్ స్వాగతం



డిపో మేనేజర్ ఆంజనేయులుకు మెమొంటో అందజేస్తున్న దృశ్యం

పెర్కిట్, జనవరి 4 : ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా నియమితులైన అంజనేయులుకు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శాలువ, మెమొంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ అధ్యక్షుడు రవి, సభ్యులు గోపి, నర్సయ్య, జనార్థన్, రాములు, గంగవ్వ, లక్ష్మీ, త్రివ్రణి, జయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవసరమైన

ఎరువులను అందుబాటులో ఉంచాలి



బాల్కొండలో తనిఖీ చేస్తున్న అధికారులు

ముప్కాల్, జనవరి4: బాల్కొండ మండలంలోని ప్రైవేటు ఎరువుల దుకాణాలను రైతులకు సరిపడ ఎరువులను అందుబాటులో ఉంచాలని భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య ఆదేశించారు. గురువారం బాల్కొండ మండలంలోని సొసైటీలు, ప్రైవేటు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాలు రైతులకు ఎరువుల అమ్మకాలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదులను ఇవ్వాలని ఆదేశించారు. యాసంగి సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన మేర ఎరువులను ఇవ్వాలని, ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎరువుల నిల్వల నివేదికను ప్రతీ రోజు వ్యవసాయాధికారి సమర్పించాలని తెలిపారు. యాసంగి సీజన్‌లో ఎక్కడ కూడా ఎరువుల కొరత రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మహేంధర్, ఏఈవోలు, దుకాణ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

శివసాయి మందిరంలో సప్తహ పారాయణం

ముప్కాల్, జనవరి4: ముప్కాల్ మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు వద్ద శివసాయి మందిరంలో గురువారం 108మంది సప్తహ పారాయణం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై సాయి పారాయణాన్ని చేపట్టారు. వారం రోజుల పాటు జరిగే సాయి పారాయణంలో ప్రజలు పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దీపోత్సవం, 108రకాలతో స్వామివారికి నైవేద్యం, పల్లకిసేవ, శోభయాత్ర, తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు అంజయ్య, దయానంద్, ఎన్.రాజు, సోమన్‌నాథ్, పృధ్వీవల్లబ్, సాయిరాజ్, సాయి సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం

భిక్కనూరు, జనవరి 4: ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని మండలంలోని ర్యాగట్లపల్లి, రామేశ్వర్‌పల్లి, బాగిర్తిపల్లి, ఇసన్నపల్లి గ్రామాల్లో గురువారం నిర్వహించారు. ప్రజలు భారీ సంఖ్యలో హాజరై తమ దరఖాస్తులను అధికారులకు ఇచ్చారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ సర్పంచ్



గోప్యనాయక్ తండా సర్పంచ్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సిరికొండ, జనవరి 4: సిరికొండ మండలంలోని గోప్యనాయక్ తండా గ్రామ సర్పంచ్ శంకర్‌లాల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.బీఆర్ఎస్ పార్టీకి చెందిన శంకర్‌లాల్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే పార్టీ కండువ కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక నుంచి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. శంకర్‌లాల్‌తో పాటు వర్స్యాన్‌తండా, గోప్యనాయక్ తండా గ్రామ పంచాయతీలకు చెందిన గ్రామా అభివృద్ధి కమిటీ, పాలక వర్గ సభ్యులు కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు. వారి మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్‌నాయక్,మోజ్యానాయక్ తదితరులు ఉన్నారు.

రాజ్య పురస్కార్ అవార్డు రావడం అభినందనీయం



స్కౌట్స్ విద్యార్థులకు మెమెంటోలను అందజేస్తున్న ఎమ్మెల్యే

సిరికొండ జనవరి 4: సిరికొండ విద్యార్థులు గవర్నర్ ద్వారా రాజ్యపురస్కార్ అవార్డును పొందడం అభినందనీయమని నిజామాబాద్ రూరల్ శాసన సభ్యులు డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. సిరికొండ కు చెందిన సత్యాశోధక్ పాఠశాలకు చెందిన స్కౌట్స్ మరియు గైడ్స్ లో రాణించి గవర్నర్ రాజ్య పురస్కార్ అవార్డును సాధించడం శుభపరిణామమని ఎమ్మెల్యే అన్నారు. రాజ్య పురస్కార్ పొందిన యశ్వంత్,నీరజ్ రాథోడ్‌లకు ఎమ్మెల్యే ప్రశంస పత్రాలను అందజేశారు. వారికి జ్ఞాపికలను కూడ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆర్.నర్సయ్య, ఉపాధ్యాయులు గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖిల్లా రామాలయ చైర్మన్‌ను మార్చాలని మంత్రికి ఫిర్యాదు

డిచ్‌పల్లి, జనవరి 4: ఖిల్లా డిచ్‌పల్లి రామాలయం చైర్మన్‌గా ఉన్న మహేందర్‌రెడ్డిని తొలగించాలని డిచ్‌పల్లి గ్రామ ప్రజాప్రతినిధులు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. గత పదేళ్లుగా మహేందర్‌రెడ్డి రామాలయ కమిటీ చైర్మన్ కొనసాగుతూ లక్షలాది రూపాయల ఆదాయం కొల్లగొడుతున్నారని రామాలయ అభివృద్ధి కి నూతన పాలక వర్గం ఎన్నుకోవాలన్నారు. గ్రామస్థుల కోరికను త్వరలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే భూపతిరెడ్డి హామీ ఇచ్చినట్లు గ్రామ ప్రతినిధులు పేర్కొన్నారు.

రేపు కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

ధర్పల్లి, జనవరి 4: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరుకానున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్‌రాజ్ గురువారం తెలిపారు. ఉదయం 11గంటలకు గ్రామంలోగల గురడిరెడ్డి కళ్యాణ మండపంలో జరుగునున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుండి గ్రామ శాఖ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన భూపతిరెడ్డి మొదటిసారిగా మండలానికి వ చ్చేస్తున్న సందర్భంగా ఘనస్వాగత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గ్రామంలో జరిగే ప్రజాపాలన కార్యక్రమానికి సైతం ఎమ్మెల్యే హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

10 వరకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం

నిజామాబాద్ అర్బన్, జనవరి 4: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు రూ.500ల అపరాధ రుసుముతో ఈనెల 10 వరకు అవకాశం ఉన్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు రూ.500ల అపరాధ రుసుముతో ఈనెల 23 వరకు అవకాశం ఉందని ఆమె తెలిపారు. పీజీ రెండవ సంవత్సరం పరీక్షలు ఈనెల 17 నుంచి 21 వరకు మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు, పీజీ మొదటి సంవత్సరం పరీక్షలు ఈనెల 27 నుంచి 31 వరకు, యూజీ మూడవ సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 16 నుంచి 22 వరకు, యూజీ ఐదవ సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఇతర వివరాలకు 7382929612 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు సిరికొండ మండలంలో ఎమ్మెల్యే పర్యటన

సిరికొండ జనవరి 4 :సిరికొండ మండలంలోని తాటిపల్లి, చీమన్‌పల్లి, సిరికొండ గ్రామాల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి శుక్రవారం పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి తెలిపారు. మొదట తాటిపల్లి గ్రామంలో ఉదయం పది గంటలకు ఆంజనేయ స్వామిని దర్శించుకుని అక్కడే ప్రజా పాలన గ్రామ సభలో పాల్గొంటారని ఆయన తెలిపారు. చీమన్‌పల్లి గ్రామంలో జరిగే సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారని ఆయన చెప్పారు. ఎమ్మెల్యే శ్రీలొంక రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు సిరికొండలో జరిగే ప్రజాపాలన గ్రామసభలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని రవి తెలిపారు.ఎమ్మెల్యే పర్యటన కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యాలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోరాడు.

కమ్మర్‌పల్లిలో అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ

కమ్మర్‌పల్లి, జనవరి 4: కమ్మర్‌పల్లి మండకేంద్రంలో గురువారం అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేశారు. గతమూడు రోజులుగా ఈ పంపిణీ కొనసాగుతోన్నది. కాగా గురువారం గ్రామంలోని భూలక్ష్మీ కాలనీలో పంపిణీ చేశారు. గ్రామంలో మరో మూడు రోజులపాటు అక్షింతల పంపిణీ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నల్ల గణేష్ గుప్తా, ఆమెడ నరేందర్, ప్రభాకర్, రమేష్, గంగాధర్, నాగభూషణం,నరేష్ పాల్గొన్నారు.

పాల్దాలో వికసిత్ భారత్ కార్యక్రమం

నిజామాబాద్ రూరల్, జనవరి 4: రూరల్ మండలం పాల్దా గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. గురువారం పాల్ద గ్రామంలోని జీపీలో కేంద్ర బృందం పర్యటించింది. కేంద్రం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. గ్రామస్థులు కేంద్రం అమలు పరుస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్ర పథకాలు ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా స్థానిక అధికారులు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్రబృందం కమల్ అరోరా, ఆదిత్య లోహియా, ఎంపీడీవో మల్లేష్, ఎంపీవో మధురిమ, స్థానిక సర్పంచ్, కార్యదర్శి ధీరేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పాల్దవాసులు, అధికారులు

ఉద్యమకారులందరికీ ఇళ్ల స్థలాలను కేటాయించాలి

బోధన్ రూరల్, జనవరి 4: తెలంగాణ ఉద్యమకారుల గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలను స్వాగతిస్తున్నామని బోధన్ జేఏసీ కన్వీనర్ గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గల అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ బోధన్‌లో 1519 రోజుల పాటు తెలంగాణ ఉద్యమం కోసం దీక్షలు కొనసాగించిన స్థలంలో పైలాన్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులందరికీ 250 గజాల ఇండ్ల స్థలాన్ని కేటాయించాలని, ఉద్యమకారుల కోసం సంక్షేమ నిధులు ఏర్పాటు చేయాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఉద్యమకారులను గుర్తించలేదని, ఉద్యమాన్ని, ఉద్యమకారులను గుర్తిస్తే కేసీఆర్‌కు గుర్తింపు తగ్గుతుందని దురుద్దేశంతో తెలంగాణ రాష్ట్రం కోసం సబ్బండ వర్గాల ప్రజలు చేసిన ఉద్యమాన్ని గుర్తించక పోవడమేగాక ఉద్యమానికి నాయకత్వం వహించిన ప్రొఫెసర్ కోదండ రామ్ ఇంటి తలుపులను బద్దలగొట్టి అరెస్టులు చేశారని పేర్కొ న్నారు. ధర్నాచౌక్‌ను ఎత్తివేసి తెలంగాణలోని ప్రజలు ఏది ప్రశ్నించినా సహించ లేక అణచివేతలతో పాలన సాగించారని, తెలం గాణ ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీశారని, అందుకే తెలంగాణ ప్రజలు మార్పును కోరుకుని బీఆర్ఎస్‌ను ఓడించారని అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అమలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి మల్లేష్, స్టీరింగ్ కమిటీ నాయకులు జి.శివరాజ్‌లతో మహేం దర్‌రెడ్డి, కె.శంకర్, పడాల శంకర్, పల్నాటి యాదగిరి, ముత్తెన్న, భాగ్య రాజ్, యూనుస్, షేక్ పాషా, మాధవరావు, సాయిలు తదితరులు ఉన్నారు.



బోధన్‌లో అమరవీరుల స్థూపం వద్ద మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

నూతన సమాజ నిర్మాణంలో టీచర్లు భాగస్వాములు కావాలి

బోధన్‌రూరల్, జనవరి 4:ఉపాధ్యాయులు నూతన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని బోధన్ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు.గురువారం బోధన్ ఆర్డీవో కార్యాలయంలో పీఆర్‌టీయూ క్యాలెండర్లను ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ సమాజాన్ని నిర్మించే శక్తి ఉపాధ్యాయులకు మాత్రమే ఉందని, కావున ఉపాధ్యాయు లు నూతన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ బోధన్ డివిజన్ ఇన్‌చార్జి శంకర్, ప్రధాన కార్యదర్శి ధన్‌రాజ్, గంగాధర్, పోతంగల్ అధ్యక్షులు వెంకటేష్, రుద్రూరు ప్రధాన కార్యదర్శి సుధీర్, రాష్ట్ర బాధ్యులు సంజీవ్‌కుమార్, మండల బాధ్యులు వాసవి, అయ్యూబ్, అభ్యందర్, బాలాజీ, శివకుమారి, వీరాజీ, గోవర్ధన్, తహసీల్దార్ తదితరులు ఉన్నారు.

రెంజల్: రెంజల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం పీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీపీ రజిని కిషోర్, జడ్పీటీసీ సభ్యురాలు విజయ సంతోష్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల కోసం నిరంతరం పాటుపడే పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించడం జరిగిందని వారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ కుమార్, ఎంపీడీవో శంకర్, సూపరింటెంట్ శ్రీనివాస్, ఎంఈవో రామారావు, పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు ఇల్తెపు శంకర్, పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, సాయరెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు రాజేందర్ సింగ్, ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, అబ్బయ్య, కిషోర్, గోవర్ధన్, గంగాధర్, తాహెర్, శ్రీనివాస్, సతీష్ వ్యాస్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.



పీఆర్‌టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ ఆర్డీవో రాజాగౌడ్

కోటగిరి రైస్‌మిల్లుల్లో విస్తృత తనిఖీలు

కోటగిరి,జనవరి4: కోటగిరి మండల కేంద్రంలోని ఓ రైస్‌మిల్లులో సీఎంఆర్ ధాన్యంపై గురువారం డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఎక్లాస్‌పూర్‌కు చెందిన వీఎంకే, ఏకే ఇండస్ట్రీస్ మిల్లుల నుండి రెండు రోజుల క్రితం రెండు లారీల్లో సీఎంఆర్ ధాన్యం అక్రమంగా తరలిస్తుండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. పట్టుకున్న వాహనాలను ఇతర రైస్‌మిల్లులో సీజ్ చేసి పెట్టారు. రెండు రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. 738క్వింటాళ్ల ధాన్యం స్వాధీనం చేసుకున్న అధికారులు రైస్ మిల్లులో ఉన్న ధాన్యం నిల్వలను పరిశీలించి అక్రమాలను వెలికి తీసే పనిలో పడ్డారు. ఇప్పటి వరకు కేటాయించిన ధాన్యంలో బియ్యం ఎంత మేరకు ప్రభుత్వానికి ఇచ్చారో గుర్తించి మిగిలిన మొత్తానికి సంబంధించి ధాన్యం నిల్వల వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తామన్నారు. అక్రమాలకు పాల్పడిన రైస్‌మిల్లులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు సీఎంఆర్ ధాన్యం కేటాయించకుండా బ్లాక్ లిస్ట్‌లో పెట్టే అవకాశం ఉంది.



కోటగిరిలోని రైస్‌మిల్లుల్లో తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

అసమానతలు లేని సమాజం కోసం పోరాటం చేయాలి

డిచ్‌పల్లి, జనవరి 4: అసమానతలు లేని సమాజం కోసం సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో పోరాటం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్ర. ధాన కార్యదర్శి కర్క గణేశ్ అన్నారు. గురువారం సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా పీడీఎస్‌యూ వర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో బాలుర వసతి గృహంలో పూలే జయంతి నిర్వహించారు.ఈసందర్భంగా సావిత్రి పూలేకు పూలదండ వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం గణేశ్ మాట్లాడుతూ.. సావిత్రీబాయి పూలే దేశంలో మొట్టమొదటి సారిగా మహిళలకు అట్ట డగు వర్గాల వారికి చదువు నేర్పించిందని, పితృసామ్య వ్యవస్థకు వ్యతి రేకంగా వితంతు వివాహాలను వ్యతిరేకంగా కుల నిర్మూలన పోరాటాలు నిర్వహించిందని అన్నారు. సావిత్రీబాయిపూలే స్ఫూర్తితో విద్యావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అసమానతలు లేని సమాజం కోసం యూనివర్సిటీ సమస్యలపై సావిత్రీబాయిపూలే స్ఫూర్తితో పోరాడలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సుందర్ సింగ్, బబ్లూ, శివా, రాజేశ్వర్,సాకేత్,అనిల్,నిఖిల్, రంజిత్, శ్రీరాం,శివా, సందీప్ పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు



లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నగర మేయర్ తదితరులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 4: అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి వేడుకలను గురువారం నగరంలోని బైపాస్ రోడ్‌లోగల స్నేహసొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ జిల్లా అంధుల వనరుల కేంద్రంలో మహిళా శిశుసంక్షేమ, వయోవృద్ధుల శాఖ, స్నేహసొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రభుత్వ అంధ ఉద్యోగుల సంఘం, అంధ నిరుద్యోగ సంఘం సహకారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ నీతూకిరణ్ హాజరై లూయిస్ బ్రెయిలీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి కేక్‌కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేంద్రియానాం నయనం ప్రధానం అనే విషయం అందరికి తెలుసని శరీరంలో ఏ అవయవం తక్కువగా ఉన్నా నెట్టుకురావచ్చు కానీ దృష్టి లోపం ఉన్నట్లయితే జీవితాన్ని నడపడం కష్టమవుతుందని ఆమె అన్నారు. సృష్టిలో దేవుడు చాలా అందమైన వాటిని సృష్టించాడని మనిషి అందమైన వస్తువులను చూసినప్పుడు కలిగే ఆనందాన్ని కళ్లులేని వారు పొందలేకపోవడం నరకమన్నారు. ఈ సందర్భంగా వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అందులకు సేవలందజేస్తున్న ఉద్యోగులను, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న అంధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి రసూల్‌బీ, మెప్మాపీడీ రాజేందర్, స్నేహసొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, సాగర్, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ కుట్రలతోనే బీఆర్ఎస్ ఓటమి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్.రాంకిషన్ రావు

నవీపేట,జనవరి4: ఇటీవల జరిగిన రాష్ట్ర శాసన సభ ఎన్నికలలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల కుట్రలతోనే బీఆర్ఎస్ ఓటమి పాలైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్.రాంకిషన్ రావు అన్నారు. శాసన సభ ఎన్నికల అనంతరం మొదటి సారిగా గురువారం మండల కేంద్రంలోని దాస్ గెస్ట్‌హౌస్‌లో మండల స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, ఓటమి రేపటి గెలుపుకు నాంది కావాలని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని ఆయన ఆరోపించారు. రాబోయే రోజులలో సర్పంచ్, ఎంపీటీసీ, సొసైటీ ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికలు కూడా ఉన్నందున కార్యకర్తలు మరింత ఉత్సాహంగా పని చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీని ఓడించడానికి కాంగ్రెస్, బీజేపీ నాయకులు కోట్లాది రూపాయలను ఖర్చు చేశారని ఆయన ఆరోపించారు. అనంతరం పార్టీ ఓటమికి గల కారణాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నర్సింగ రావు, భవంతి దేవిదాస్, సాయిబాబా గౌడ్, వైస్ ఎంపీపీ హరీష్ కుమార్, నవీపేట సొసైటీ చైర్మన్ అబ్బన్న, వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, తెడ్డు పోశెట్టి, బుచ్చన్న, కిషోర్ రావు, మల్లేష్, బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



నవీపేటలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు రాంకిషన్ రావు

2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి



మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఉపాధ్యాయులు

నిజామాబాద్‌అర్బన్, జనవరి 4: కేంద్ర ప్రభుత్వ మెమో 57 ఆధారంగా డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని 2003 డీఎస్సీ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి ప్రతినిధులు గురువారం రాష్ట్రఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబును, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను రద్దు చేయాలని, జీవో 317 ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. పదోన్నతులలో టెట్ మినహాయింపు ఇవ్వాలని లేదా ఆరు సంవత్సరాల్లో పాసయ్యే అవకాశం ఇవ్వాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు మాడవేడి వినోద్‌కుమార్, సంతోష్‌కుమార్, వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మోస్రా,జనవరి4: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన పాటలు ఆలపించారు. పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పంతులు నరేందర్, ఆలయ ధర్మకర్త పుష్పలత రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

డిచ్‌పల్లి, జనవరి 4: డిచ్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సంఘ అధ్యక్షుడు గజవాడ జైపాల్‌పై కార్యవర్గ సభ్యులు అవిశ్వాస తీర్మాణం ప్రవేశ పెట్టి డీసీవో సింహచలానికి అవిశ్వాస నోటీస్ అందజేశారు. 1964 చట్టం ప్రకారం సభ్యులు పెట్టిన తీర్మానం మేరకు జనవరి 23 ఉదయం 11గంటలకు అవిశ్వాన తీర్మానంపై చర్చ జరిపి ఓటింగ్ నిర్వహించను న్నామని డీసీవో సింహచలం ఒక ప్రకటన జారీ చేశారు. అవిశ్వాసం పెట్టిన వారిలో డైరెక్టర్ చిన్న నర్సింహులు, చిన్న గంగారం, బాలమల్లు, దాసరి రమేశ్, రాంచందర్ గౌడ్, అంకం లత, రాజవ్వ, సాయమ్మ, హరిచంద్, గంగారెడ్డి, సతీశ్‌రెడ్డి, శాంసన్, తదితరులు ఉన్నారు. సహకార సంఘంలో జరిగిన అవినీతి తోనే ఈ ఆవిశ్వాస తీర్మాణం ప్రవేశ పెట్టిన్నట్లు సభ్యులు పేర్కొన్నారు.

ప్రజలు భయపడకుండా పరీక్షలు చేసుకోవాలి

- హెచ్ఐవీపై కళాజాత



బోధన్‌లో హెచ్ఐవీపై కళాజాతా దృశ్యం

బోధన్ రూరల్, జనవరి 4: ప్రజలు భయపడకుండా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులలో హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని ఐసీటీసీ కౌన్సిలర్ రాజన్న అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రాంగణంలో హెచ్ఐవీపై కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలు చెడు మార్గాల వైపు వెళ్లవద్దన్నారు హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ సభ్యులు సావిత్రి, సంపూర్ణ సురక్ష కేంద్రం స్రవంతి, జనంపాట డప్పు కళాకారులు సంతోష్, గోపాల్‌లతో తదితరులు పాల్గొన్నారు.

చౌట్‌పల్లిలో కాంప్లెక్స్ సమావేశం



విద్యార్థులకు బోధిస్తున్న అధికారులు

కమ్మర్‌పల్లి, జనవరి 4: మండలంలోని చౌట్‌పల్లి బాలికల ప్రాథమిక పాఠశాలలో బుధవారం కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాంప్లెక్స్ పరిదిలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు హాజరుకాగా వారివారి పాఠశాలల్లో ఎఫ్ఎల్ నిర్వహణ పద్ధతులను, లైబ్రేరి నిర్వహణ పద్ధతులను కాంప్లెక్స్ హెచ్ ఎం ఎంఈవో ఆంధ్రయ్య, మండలనోడల్ అధికారి కనక గంగాధర్ జిల్లా సీసీటీ వెంకటేశ్వరులు, కిషన్ ఉన్నతి లక్ష్మీనాథం ఉపాధ్యాయులకు వివరించారు. అనంతరం ఉపాధ్యాయుల విద్యాబోధన పద్ధతులను పర్యవేక్షించారు. వివిధ పాఠ్యశాల నిర్వహణ విధానాలను వివరించారు సమావేశంలో కాంప్లెక్స్ కార్యదర్శినరేందర్ కాంప్లెక్స్ పరిదిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అండర్-14 రగ్బీ ఎంపికలు

సుభాష్‌నగర్, జనవరి 4: జిల్లాస్థాయి అండర్-14 రగ్బీ ఎంపికలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నరేష్, అబ్బయ్యలు తెలిపారు. మోపాల్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఉదయం 9గంటలకు మైదానానికి చేరుకోవాలని తెలిపారు.

మోడల్ స్కూల్‌కి బస్సు సౌకర్యం కల్పించాలి

వర్ని,జనవరి4: వర్ని ఉమ్మడి మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మోడల్ స్కూల్, కాలేజ్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని పీడీఎస్‌యూ వర్ని కళాశాలల అధ్యక్షురాలు సీత డిమాండ్ చేశారు. గురువారం వర్ని మండల కేంద్రంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాదాపు 800మంది విద్యార్థులు మోడల్ స్కూల్‌లో చదువుకుంటున్నారని ఉదయం, సాయంత్రం విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. అధికారులు చొరవ తీసుకుని ఆర్టీసీ బస్సును నడపాలని లేకపోతే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిన్న, జైన, సరోజ, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేస్తాం’


దరఖాస్తు ఫారాలను స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్


జాకోరలో దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం


బాబాపూర్‌లో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్, అధికారులు

బోధన్‌రూరల్, జనవరి4: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అభయహస్తం ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేస్తామని బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని 31, 33, 35, 36 తదితర వార్డులలో ప్రజా పాలన కార్యక్రమాలను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనలో భాగంగా ప్రతీ దరఖాస్తును అధికారులు స్వీకరించాలని పేర్కొన్నారు. ప్రజాపాలన కార్యక్రమ నిర్వహణ తీరుతెన్నులను పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమ లు చేస్తున్న ఆరు గ్యారెంటీలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఇప్పటి వరకు కౌంటర్ల ద్వారా తీసుకున్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి లబ్ధిదారుడు దరఖాస్తుతో ఆధార్, రేషన్ కార్డులను జత చేసి అధికారుల నుంచి రసీదును తీసుకోవాల న్నారు. అధికారులు తమ విధులను బాధ్యాతాయుతంగా నిర్వహించాల న్నారు. దరఖాస్తు ఫారాల కోసం ప్రజలు ఇబ్బందులు పడవద్దని, ప్రభు త్వమే ఉచితంగా దరఖాస్తు ఫారాలను అందజేస్తుందన్నారు. ఎవరైనా దరఖాస్తు ఫారాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డీఈ శివానందం, మేనేజర్ నరేందర్, కౌన్సిలర్లు పిట్ల సత్యం, అల్తాఫ్,జావీద్,శరత్‌రెడ్డి,సంబంధితశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని సిరన్‌పల్లి, యంచ, బినోల, ఆశాజ్యోతి కాలనీలలో గురువారం ప్రజా పాలన గ్రామసభలు నిర్వహించారు. ఐదు గ్యారంటీ స్కీమ్‌లను సంబంధించి స్థానిక ప్రజలు చేసుకున్న దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, తహసీల్దార్ ధన్‌వాల్, ఎంపీవో రామకృష్ణ, ఏఎస్ఐ, అధికారులు పాల్గొన్నారు.

వర్ని: వర్ని, చందూర్ మండలాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన కార్యక్రమం గురువారం ముగిసింది. జాకోర, సత్యనారాయణ పురం గ్రామాలలో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు కోర్వ గోదావరి, నేమాని నాగమణి వీర్రాజు, చంద దత్తు, కృష్ణ రెడ్డి, దయానంద్, వైస్ ఎంపీపీ బాలరాజు, అధికారులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: ప్రజాపాలన కార్యక్రమంలో అర్హులైన ప్రతీ ఒక్కరూ దరఖాస్తు చేసుకొని లబ్ధిపొందాలని తహసీల్దార్ వెంకట్రావ్ అన్నారు. గురువారం ఇందల్వాయి మండలంలోని చంద్రయాన్‌పల్లి, అన్సాన్‌పల్లి, ఎల్లారెడ్డిపల్లి గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలపై అర్హులైన ప్రతీ ఒక్కరిని దరఖాస్తు చేసుకోవాలని తెలపడంతో గ్రామాల్లో ప్రజాపాలనకు విశేష స్పందన వస్తోందని అన్నారు. మండలంలో గురువారంతో గ్రామసభలు ముగిసాయని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం 6వ తేదీ వరకు కొనసాగుతోందని ఎవరైనా దరఖాస్తు చేసుకోనివారు ఉంటే ఆయా గ్రామ పంచాయతీలలో తమ దరఖాస్తు ఫారాలను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి లక్ష్మారెడ్డి, తహసీల్దార్ వెంకట్రావ్‌రావు, ఎంపీడీవో రాములు నాయక్, ఎంపీవో రాజ్‌కాంత్, సర్పంచులు లలిత గంగాదాస్, గుర్రపు నరేష్, బండ గంగవ్వ, ఉపసర్పంచ్ ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

● రామడుగులో ప్రజాపాలన గ్రామ సభ

సిరికొండ: మండలంలోని రామడుగు గ్రామంలో ప్రజా పాలన గ్రామ సభ జరిగింది. ఈ సమావేశంలో తహసీల్దార్ రవీందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజల నుంచి ఆరు గ్యారెంటీల అమలు కోసం దరఖాస్తులు స్వీకరించారు.కార్యక్రమంలో సర్పంచ్ ఇజాప లక్ష్మీనర్సయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు కుందేళ్ల శ్రీనివాస్, గ్రామ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కోటగిరి: ప్రజా పాలనను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వర్ని శంకర్ సూచించారు. పొతంగల్ మండల కేంద్రంలో గురువారం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. పొతంగల్ గ్రామంలో సుమారు 1500లకు పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శంకర్, మాజీ ఎంపీపీ పవన్, తహసీల్దార్ రమేష్, ఎంపీటీసీ వీరేశం, నాయకులు మాణిక్ అప్ప, పంచాయతీ కార్యదర్శి యాదు, పాల్గొన్నారు.

భీమ్‌గల్ రూరల్: మండలంలోని బాబాపూర్, పిప్రి, సికింద్రాపూర్, గోన్‌గొప్పుల తదితర గ్రామాలలో గురువారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాల అభయహస్తం ప్రజాపాలన కార్యక్రమం గ్రామాల్లో కొనసాగుతోంది. ఆయాగ్రామాలకు చెందిన స్పెషల్ అధికారులు, మండలస్థాయి, రెవెన్యూ,ఐకేపీ, పోలీస్ శాఖ అధికారులు ప్రజాలపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలకు ఇబ్బం దులు లేకుండా అన్ని విధాలా సహకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఎంపీఎం కుంట శ్రీనివాస్, ఎస్ఐ చిరంజీవి, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీవో గంగమోహన్, ఎంపీడీవో రాజేశ్వర్ పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రజా పాలన సదస్సులను నిర్వహిస్తోందని వాటిని ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని డీఆర్‌డీవోపీడీ చందర్ నాయక్ సూచించారు. గురు వారం ఆయన డిచ్‌పల్లి మండలంలోని యానంపల్లిలో జరుగుతున్న ప్రజాపాలన సదస్సును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ..తెలంగాణ ప్రభుత్వం 6గ్యారంటీల అమలు కోసం ఈగ్రామ సద స్సులు పకడ్బందీగా నిర్వహిస్తోందని సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలనే ఉద్దేశ్యంతోనే ప్రజాపాలన నిర్వహిస్తోందని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో తహసీల్దార్ పాల్గొన్నారు.

● మిట్టపల్లిలో ప్రజాపాలన సదస్సు

గ్రామాల్లో నెలకొన్న మౌలిక సమ స్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రామ సభలను, ప్రజాపాలన ద్వార ధరఖాస్తులను స్వీకరిస్తుందని ప్రజాపాలన సదస్సులు గ్రామీణ ప్రజల మౌలిక సమ స్యల పరిష్కారానికేనని ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు అన్నారు.పింఛన్లు, 6గ్యారెంటీల కోసం దరఖాస్తులను పూర్తి స్థాయిలో నింపి వెరిపికేషన్ అధికారులకుఅందజేయలన్నారు.ఆయన వెంట సర్పంచ్ గణేశ్, ఎంపీ టీసీ గంగాధర్, మాజీఎంపీపీ కంచెట్టి గంగాధర్, గ్రామ ప్రతిని ధులు, కిషన్, రాజన్న,ఒడ్డంనర్సయ్య, పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎమ్మెల్యే ధన్‌పాల్


మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్, జనవరి 4: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ బీజేపీ నాయకులను, కార్యకర్తలను కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అనుగుణంగా పని చేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఈ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నగరంలో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం వర్ని చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ వాహనం మనముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ముద్ర యోజన, ఉజ్వల యోజన ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు కేంద్రం అందజేస్తుందని కరోనా సమయంలో ఎంతో మంది వీధి వ్యాపారులకు రుణాలు ఇచ్చిన ఘనత కేంద్రానిది అన్నారు. భేటీ బచావో-భేటీ పడావో, ఆయుష్మాన్ భారత్ పథకం, ప్రధాన మంత్రి జీవనజ్యోతి, సురక్షా యోజన, జన్ ధన్ యోజన, ఆవాస్ యోజన ద్వారా అనేక పథకాలను కేంద్రం అందిస్తుందన్నారు. విశ్వకర్మ పథకాన్ని కూడా కేంద్రం చేతి వృత్తుల వారికి ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ధర్మానాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, ఎన్‌వైకే కోఆర్డినేటర్ శైలిబెల్లాల్, తదితరులు పాల్గొన్నారు.

●అయోధ్య శ్రీరామ తీర్థక్షేత్ర ట్రస్ట్ కోకన్వీనర్‌గా ధన్‌పాల్

ఇటీవల జరిగిన అయోధ్య పునఃనిర్మాణం సమావేశంలో అయోధ్య రామమందిర ప్రారంభోత్సవ కమిటీ తెలంగాణ కోకన్వీనర్‌గా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త నియమితులయ్యారు. ఈ మేరకు అయోధ్య పునఃనిర్మాణం కమిటీ నియామక ఉత్తర్వులను వెల్లడించారు. ఆయన నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున ప్రజలను అయోధ్యకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మధుమలంచ జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మించాలి : ఏబీవీపీ

బోధన్‌రూరల్, జనవరి 1: బోధన్ పట్టణంలోని ప్రభుత్వ మధుమలంచ జూనియర్ కళాశాలకు స్థలం కేటాయించి నూతన భవన నిర్మాణం చేపట్టాలని ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో గురువారం బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట కళాశాల విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ మధుమలాంచ జూనియర్ కళాశాలకు అరకొర వసతులతో నడుస్తోందని, ప్రస్తుతం భవనం శిథిలావస్థలో ఉందని విద్యార్థుల సౌకర్యార్థం నూతన భవనం నిర్మిం చాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మొగులాజీ, ప్రవీణ్, అధూసింగ్, నాగరాజు, ధన్‌సింగ్, ప్రశాంత్, కళాశాల విద్యా ర్థులు తదితరులు పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న లీకేజీ జలాల్‌పూర్ ఎత్తిపోతల జలాలు


మోర్తాడ్ బైపాస్‌లో లీకేజీ అవుతున్న ఎత్తిపోతల నీరు

మోర్తాడ్, జనవరి3: మోర్తాడ్ శివారులో బైపాస్ రోడ్డు వద్ద హన్మంత్‌రెడ్డి పోత్తిపోతల జలాలు గత రెండు రోజులుగా లీకేజీ వల్ల ఎత్తిపోతల జలాలు పొంగి పొర్లుతున్నాయి. కమ్మర్‌పల్లి ప్రధానరహదారి పక్కన ఏర్పాట్లు చేసిన రెండు వాల్వుల ద్వారా భారీ ఇరిగేషన్ అధికారులు ఇప్పటి వరకు కనీసం స్పందించలేదని రైతులు అంటు న్నారు. భారీ లీకేజీలు కావడంతో ఈ ప్రాంతం అంత జలమయమైంది. రెండు భారీగా తోటల్లోకి వస్తోందని రైతులు అన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీకేజీలను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

అంకాపూర్‌ను సందర్శించిన హన్మకొండ జిల్లా రైతులు


అంకాపూర్‌లో పసుపు పంటను పరిశీలిస్తున్న హన్మకొండ రైతులు

ఆర్మూర్‌రూరల్, జనవరి4: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని హన్మకొండ జిల్లా ఐనవోలు మండలానికి చెందిన రైతులు సందర్శించారు. నాబార్డు సహకారంతో సహయం సోషల్ సర్వీస్ సేవ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రైతు శిక్షణ కార్యక్రమంలో భాగంగా రైతులు అంకాపూర్ గ్రామంలోని పంట పొలాలను పరిశీలించారు. ఇక్కడి రైతులు పంటల సాగులో అవలంభిస్తున్న పద్ధతులు, సాగునీటి యాజమాన్య పద్ధతులను అడిగితెలుసుకున్నారు. వివిధ రకాల కలుపు నివారణ పనులను,భూమిసారావంతమయ్యేందుకు తీసుకుంటున్న చర్యలను వారికి వివరించారు. ఈ సందర్భంగా హన్మకొండ రైతులు ఎర్రజొన్న, మొక్కజొన్న, పసుపు, కూరగాయల పంట లను పరిశీలించారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం అధ్య క్షుడు గంగారెడ్డి,బాజన్న,సేవసొసైటీకార్యదర్శిరైతులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి దీక్ష చాలా గొప్పది

బోధన్ రూరల్, జనవరి 4: అయ్యప్ప స్వామి దీక్ష చాలాగొప్పదని బోధన్ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. బోధన్ పట్టణంలోని భీమునిగుట్ట వద్ద గల అయ్యప్ప స్వామి దేవాల యంలో గురువారం అయ్య ప్ప మహాపడిపూజ కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గణపతిపూజ, అభిషేకాలు, హారతి మంత్రపుష్పం, పడిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వామి దీక్ష చాలా పవిత్రమైందని, కోరిన కోర్కెలు తీర్చే అయ్యప్ప అందరివాడని ఆర్డీవో పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో గురు స్వాములు ఐఆర్ చక్రవర్తి,ప్రసాద్,భక్తులు తదితరులు పాల్గొన్నారు.


అయ్యప్ప ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న ఆర్డీవో

పేదప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి


మంత్రి దామోదర రాజనర్సింహ పుష్పగుచ్చం అందజేస్తున్న డాక్టర్ ప్రతిమ

మాక్లూర్, జనవరి4: పేదప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలను అందించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వైద్య సిబ్బంది ఆదేశించారు. గురువారం మండలంలోని మామిడిపల్లి గ్రామశివారులో గాల శ్రీ అపురూప వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం అహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించారని వారు కొనియాడారు. ఆలయానికి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని అలాగే విద్యార్థులతో పాటు పేదప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరవుతారని, వారి కోసం కమ్యూనిటీహాల్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆలయ కమిటీ సభ్యులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మంత్రి కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం రూ.25లక్షలు మంజూరుకు హామీ ఇచ్చారు. అనంతరం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ప్రతిమను పిలిచి ఆసుపత్రి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రులు ప్రతీరోజు రెండు వేల మంది ఔట్ పేషెంట్‌తో పాటు 800మంది ఇన్‌పేషెంట్లు ఉంటున్నారని అన్నారు. అంతేగాకుండా సుమారు 600నుంచి 700వరకు ప్రసూతిలు జరుగుతాయని, నెలకు 150వరకు మోకాలు చిప్పలకు సర్జరీలు చేస్తామని తెలిపారు. ఆసుపత్రిలో ఎంఆర్ఐతో పాటు ఎక్స్‌రే, ఆపరేషన్ థియేటర్‌లు ఏర్పాటు చేస్తే రోగులకు మరింత చేరువుతామని డాక్టర్ ప్రతిమ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆసుపత్రికి అవసరమైన సేవలను అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ ఇనచార్జీ వినయ్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అమృతలత, సభ్యులు ప్రభమేడంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొనాలి : టీయూ రిజిస్ట్రార్


పోటీల్లో తలబడుతున్న టీయూ విద్యార్థులు

డిచ్‌పల్లి, జనవరి 4: నేతాజీ సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన యువజన క్రీడ ఉత్సవాలను టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి, ప్రారంభించారు. ఈసందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. విద్యా ర్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ఓటమిని గెలుపుగా స్వీకరించి ప్రతీ క్రీడకారుడు ముందుకు సాగలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివా, నాగరాజు, సాయికుమార్, అమృత్ చారి, ప్రమోద్, సింహాద్రి,నర్సింహ, పాల్గొన్నారు.